# పక్క వాయిద్యాలు

ఏ రకం కచేరీకయినా పక్క వాయిద్యాలు చాలా ముఖ్యం. ఏ వాయిద్య సహకారం లేకుండా గాయకుడు గొంతెత్తి కీర్తన పాడితే, వినసొంపుగా వుండదు. మంగళ హారతిలా చిర్రు పుట్టిస్తుంది. గాత్ర కౌశాల్యాన్ని పక్క వాయిద్యాలు పది రెట్లు మెరుగుపరుస్తాయి కొన్ని కంఠాలు శ్రావ్యంగా లేకపోయినా, అసలు వినబుల్ కాదని మనం అనుకున్న సందర్భాల్లో కూడా ఈ పక్క వాయిద్యాల ప్రతిభ వల్ల, మనల్ని మనం మరచిపోయి, తలకాయని జెండా కాగితంలాగా రెపరెపలాడించేస్తాం. అంచేత ఈ వాయిద్య సహకార మహిమ అనిర్వచనం. అసాధారణం అలాగని కచేరీని కేవలం పక్క వాయిద్యాలకే వదిలేస్తే, కార్యక్రమం రసాభాసవుతుంది. గాయకుడిని ఎవరూ మెచ్చుకోరు మద్దెల మాష్టార్ని, ఫిడేలు పంతులు గారిని సెభాషంటారు. అంచేత తెలివి గల గాయకుడు ప్రతిభ లేనపుడు, ప్రక్క వాయిద్యాల్ని జాగ్రత్తగా బాలన్స్ చేసుకుని కార్యక్రమాన్ని నడిపించాలి.

అసలీ పక్క వాయిద్యాల సంగతి కచేరీలు చేసే వాళ్ళకన్నా, వేరే రంగాల్లో వున్న కొంతమందికి బాగా తెలుసు. ప్రజా సేవకులు, కవులు , రచయితలు, కళాకారులు , సమాజం గురించి కంటతడి పెట్టే ఆదర్శమూర్తులకి ఈ పక్క వాయిద్యాలు ఎంతో అవసరం. మన గురించి మనం గొప్పగా చెప్పుకుని పొగిడేసుకోవటం, చెప్పుకునే మనకి ,వినే వాళ్ళకీ కూడా ఇబ్బందిగా వుంటుంది. అంచేత మన గురించి పదిమందికి చెప్పేందుకు సుశిక్షితులయిన సైనికుల్లాంటి ముగ్గురు నలుగురు కుర్రాళ్ళు కావాలి. కచేరీకి పక్క వాయిద్యాలెంతో, మనకి వీళ్ళు అలాంటి వాళ్ళన్నమాట. ఈ రోజుల్లో ఎవరికయినా కేవలం ప్రతిభ మాత్రమే వుంటే సరిపోదు. ప్రచారం కావాలి. పది మందికి మన గురించి తెలియజెప్పే మార్గం కోసం అన్వేషించాలి. లేని పక్షంలో రాణింపు కష్టం.

మొన్నీ మధ్యన ఒక పెద్ద ఆఫీసరు గారు సొంత పనిమీద మా ఆఫీసుకొచ్చారు. వస్తూ వస్తూ వెంట తనకింద పనిచేసే ఒక గుమాస్తాని పక్క వాయిద్య సహకారం కోసం

వెంట తెచ్చుకున్నారు. ఆ గుమాస్తా గారు మా సెక్షన్లోకి రాగానే. పక్కనున్న కుర్చీని బర్రున పంకాకిందకి లాగి, వాళ్ళ బాస్‌ని సుఖాసీనుడిని చేసి గ్లాసు తీసుకుని , చల్లటి నీళ్ళని తెచ్చి వారి చేత తాగించి, ఇంకా ప్యాన్ స్పీడు పెంచి, తర్వాత వారి గురించి మాకు చెప్పే కచేరీని ప్రారంభించేరు. వారు నిప్పులాంటి ఆఫీసరట. అవినీతంటే అస్సలు తెలీదుట. పేద వాళ్ళంటే పడిచచ్చిపోతాట్ట. వీరే లేకపోతే ఫలాన వూళ్ళో ట్రంకు రోడ్డు పడేది కాదట. ఇంకో వూరిపై రైలు బ్రిడ్జి వచ్చుండేది కాదట. గిట్టని వాళ్ళు వారిపైన అవినీతి నేరాలు మోపి సస్పెండు చేయించేరట. ఇది వారికేం కొత్త సంగతి కాదట. ఇప్పటికి పదహారు సార్లు సస్పెండయ్యి తిరిగి లోనికొచ్చేరట. అప్పుడర్థం అయింది వస్తూ వస్తూ వారు వాయిద్యాల్ని ఎందుకు వెంట తెచ్చుకున్నారో !

అసలు పొగడ్తలంటే గిట్టని వాళ్ళు మనలో చాలా తక్కువ మంది వుంటారు. ఇంట్లో పనిమినషి దగ్గర్నించి , మనం పన్జేస్తున్న బాస్ దాకా ఎవరయినా సరే మనల్ని పొగిడితే బుస్సున పొంగిపోతాం. పక్క వాయిద్యం వాయించటం ఒక ప్రత్యేకమైన కళ . దానికి శాస్త్రం తెలియాలి. గుడ్డిగా వాయించుకుంటూ పోతే కొంపలంటుకుపోతాయి .అసలు పని పాడయిపోతుంది. ఈ విషయంలో ఆరితేరిన ఘనాపాటి లాంటి ఫ్రెండొకడున్నాడు. ఎవరిని పొగుడుతున్నా ఆవు మీద వ్యాసం రాసినంత తేలిగ్గా పని పూర్తి చేయగలడు. ముష్టివాడ్ని అరగంట పొగిడి మీచేత వాడికి నమస్కారం చేయిస్తాడు. హెల్మెట్టు రూలున్న రోజుల్లో , అది లేదని వీడిని యస్సయి గారు ఆపి జరిమానా కట్టమన్నారట. ఆఫీసరుగారి పేరు ఆయన జేబుకి పట్టుకుని వేలాడుతోందిట. పేరు చూచి వాడు ఇహనంతే – పేట్రేగిపోయి, మీరు ఫలానా వూళ్ళో వున్నారా, ఇంకా ప్రమోషన్ రాలేదా అంటూ వీర్ని పొగుడుతూ, వీర్ని గుర్తించని వారి డిపార్టుమెంటుని తిడుతూ ఇరవై నిమిషాలు కచేరీ చేసి, జేబులోంచి పర్సు తీస్తూ అసలు మీలాంటి గొప్ప ఆఫీసరు దగ్గర జరిమానా కట్టడం నే చేసుకున్న పుణ్యఫలం – జన్మ జన్మలకి ఈ అదృష్టం సొంతం కావాలంటూ ఎంత కట్టమంటారని అడిగేట్ట . ఈ యస్సయి గారు కళ్ళు తుడుచుకుంటూ ' చాల్లే వూరుకోండి టీ తాగి వెళ్ళండ ' న్నాట్ట ! అంచేత ఈ కళని చిన్న చూపు చూడకండి. అసలు మా ఫ్రెండయితే అన్ని కళల్లోకి దీనికే ప్రథమ స్థానం ఇవ్వాలంటాడు. దేవుడయినా సరే సరైన పద్ధతిలో స్తుతిస్తేనే గాని, దిగి రాట్ట, వరాలు ఇవ్వట్ట.

అంచేత ప్రజల గుర్తింపు పొందాలని తహ తహలాడే వాళ్ళంతా ఈ కళలో తర్ఫీదయిని పక్క వాయిద్యాల్ని తయారు చేసుకోవాలిట. ప్రతి స్కూలు, కాలేజీలో ,

యూనివర్సిటీల్లో కూడా పొగడ్తలు. విమర్శలు అనే విభాగాలని ఏర్పాటు చెయ్యాలంటాడు. కుర్రాళ్ళకి పొగట్టం నేర్పితే వాళ్ళపొట్ట వాళ్ళు పోసుకుంటారట, ప్రభుత్వానికి నిరుద్యోగ సమస్య తీరిపోతుందిట. ఇంకా ప్రతి ఏటా అఖిల భారత పొగడ్తల ఫోటీని ఎవరయినా నిర్వహించి, గెల్చిన వాళ్ళకి పొగడ్తకేసరి అనో పొగడ్త మార్తాండ అనో టైటిల్సు కూడా ఇవ్వాలంటాడు. ఇలాంటి స్కీములు, బృహత్తర పధకాలు మా వాడి దగ్గర పుష్కలంగా వున్నాయి. నన్ను అర్ధరోజు పొగిడి ఇదంతా నా చేత రాయించాడు మరి !

ఈ రోజుల్లో సాహిత్యం, కళలు , ప్రజాసేవ అన్ని వ్యాపారంగా మారిపోయినాయి కాబట్టి పబ్లిసిటీ ఎంతో ముఖ్యం. పబ్లిసిటీ లేని వ్యాపారం, చీకట్లో నిల్చుని చిన్న దానికి కన్ను గీటటం లాంటిది. మీరేం చేస్తున్నారో మీకు తెల్సు. కానీ అమ్మడికి తెలీదు. అంచేత మీరు గాని ఈ లైన్లో వుండి, ఇంకా పక్క వాయిద్యాల్ని ఏర్పాటు చేసుకోకపోతే, వెంటనే నడుం బిగించి లేవండి..... మంది మార్బలాన్ని ఏర్పాటు చేసుకుని కచేరీ ప్రారంభించడండి ..... ఆల్ ది బెస్ట్ !

-------- అయ్యిపోయింది --------